సాక్షి
నిజామాబాద్
సోమవారం । 8 । జనవరి । 2024



మోక్షమెప్పుడో..?
నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కొత్త వంతెనలకు నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కావట్లేదు.
- 8లో ▸



నో స్కానింగ్..
సామాజిక ఆస్పత్రుల్లో స్కానింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్‌లు లేకపోవడంతో గర్భిణులకు సేవలందడం లేదు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.7 /17.7

వాతావరణం
ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వేగంగా తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం
● 20 రోజుల్లో 11 టీఎంసీలు ఖాళీ



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్ నుంచి గతనెల 18వ తేదీ నుంచి కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల ప్రారంభించారు. ప్రాజెక్ట్‌లో నీటి విడుదల ప్రారంభ దశలో 78 టీఎంసీల నీరు ఉండగా ప్రస్తుతం 67 టీఎంసీలకు తగ్గింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 20 రోజుల వ్యవధిలో 11 టీఎంసీల నీరు ఖాళీ అయింది. అంటే ప్రతి రోజుకు 0.5 టీఎంసీల కంటే ఎక్కువ నీరు ఖాళీ అవుతోంది. ప్రస్తుత యాసంగి సీజన్‌కు 60 టీఎంసీలను ప్రభుత్వం కేటయించింది. అందులో ఇప్పటికే 11 టీఎంసీలు విడుదల జరిగింది. వరద కాలువ ద్వారా క్రితం రోజు నుంచే నీటి విడుదలను ప్రారంభించారు. కాకతీయకాలువ ద్వారా 7.5 టీఎంసీలు, సరస్వతి కాలువ ద్వారా 0.5 టీఎంసీలు, లక్ష్మీకాలువ ద్వారా 0.26 టీంసీలు, వరద కాలువ ద్వారా 0.24 టీఎంసీలు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 0.5 టీఎంసీలు, గుత్ప లిఫ్ట్ ద్వారా 0.41 టీఎంసీలు ప్రాజెక్ట్ ముంపు గ్రామాల ఎత్తిపోతల పథకల ద్వారా 0.5 టీఎంఊలు, ఆవిరి రూపంలో 0.68 టీఎంసీల నీరుపోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1085.10 ఉంది.

ఎంపీ అర్వింద్‌కు అక్షింతల అందజేత



నిజామాబాద్ సిటీ : శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అయోధ్య పూజిత అక్షింతలను వీహెచ్‌పీ బాధ్యులు జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఆయన నివాసంలో అందజేశారు. జిల్లా కేంద్రం సుభాష్‌నగర్‌లో ఆదివారం ఎంపీ నివాసంలో వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి తుమ్మల కృష్ణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, ఉపాధ్యక్షుడు రెబ్బ ఆనంద్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా సహ కార్యాదర్శి అరుణ్ రెడ్డి, జిల్లా కోశాధికారి నాంపల్లి చంద్రశేఖర్, జిల్లా ప్రచార ప్రముఖ నిఖిల్, నగర అధ్యక్షుడు కొడిమల శ్రీనివాస్, కార్యదరి రాము చటర్జీ, సహ కార్యదర్శి సతీష్, నగర భజరంగ్ సంయోజక్ అఖిల్, సహ సంయోజక్ కుర్రి రవి, నగర సత్సంగ్ ప్రముఖ మహేందర్ వర్మ, అజయ్ తదితరులున్నారు.

రేపు జాబ్‌మేళా
నిజామాబాద్‌నాగారం : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ కర్మాగారాల శాఖ కింద ఇజ్రాయెల్‌లో విదేశీ ఉద్యోగ నియమాకాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయ్‌మెంట్ జిల్లా అధికారి ఎస్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న నగరంలోని ఐటీఐ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు. పదోతరగతి పాసై మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. వయస్సు 21–45 ఏళ్ల మధ్య ఉండాలని, ఇజ్రాయిల్‌లోని నిర్మాణ కార్మికులు షట్టరింగ్ కార్పెంటర్లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బైండింగ్ చేయడానికి డిమాండ్ ఉందన్నారు. వివరాలకు 82478 38789, 98496 39539 సంప్రదించాలన్నారు.

13 నుంచి కళాశాలలకు సంక్రాంతి సెలవులు
కామారెడ్డి టౌన్: జూనియర్ కళాశాలలకు ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించవద్దని కళాశాలల యాజమాన్యాలకు సూచించారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి
భిక్కనూరు/దోమకొండ: సేవా కార్యక్రమాల్లో ముందున్న పద్మశాలీలు రాజకీయంగానూ ఎదగాలని పద్మశాలి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రమా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం భిక్కనూరు మండలం బీటీఎస్ వద్ద గల ఇంద్రప్రస్థ వద్ద జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో పద్మశాలీల సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయ్యిందన్నారు.

బాల్యానికి భరోసా



బడిబయట వెట్టిచాకిరీలో మగ్గుతున్న చిన్నారులను గుర్తించి తిరిగి వారిని పాఠశాలలకు పంపించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమమే ఆపరేషన్ ముస్కాన్. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా వెట్టిలో మగ్గుతున్న బాలబాలికలను విముక్తుల్ని చేసి వారి జీవితా ల్లో బంగారుబాటలు వేసేందు కు అధికారులు కృషి చేస్తున్నా రు. జనవరి 1వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

ఆపరేషన్ ముస్కాన్
- ఈనెల 1న ప్రారంభమైన కార్యక్రమం
- ఇప్పటి వరకు 10 మంది బాలకార్మికుల గుర్తింపు
- తల్లిదండ్రుల చెంతకు చేర్చిన అధికారులు
- మూడేళ్లలో 332 మందికి విముక్తి

ఖలీల్‌వాడి/బాల్కొండ : పాఠశాలల్లో చదువుకోవాల్సిన పిల్లలు బడిబయట దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. హోటళ్లు, లాడ్జీలు, ఇటుక బట్టీలు, చెత్త సేకరణ పనులు చేస్తున్నారు. వారికి విముక్తి కల్పించడానికి జిల్లాలో పోలీసు, బాలల సంరక్షణ శాఖల ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ (స్మైల్) కార్యక్రమం ఈనెల 1 నుంచి ప్రారంభం కాగా 31 వరకు కొనసాగుతుంది. ఇప్పటి వరకు 10 మంది బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. తప్పిపోయిన వారు, కుటుంబ అవసరాల రీత్యా పనుల్లో చేరిన చిన్నారులకు విముక్తి కల్పించి వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. తల్లిదండ్రుల ఆచూకీ లభించని పిల్లలను రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలిస్తారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 2015 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. పోలీసు, ఐసీడీఎస్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏడాదికి రెండుసార్లు నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

జిల్లాలో మూడు బృందాలు

హోటళ్లు, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇటుక బట్టీలు, మెకానిక్ షెడ్‌లతో పాటు వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తున్న చిన్నారులను గుర్తిస్తారు. జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన చిన్నారులను సైతం గుర్తించి వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చుతారు. జిల్లాలో మూడు బృందాలు పనిచేస్తున్నాయి. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఎస్‌సైలు ఇన్‌చార్జులుగా ఉన్నారు. ఈ బృందంలో నలుగురు కానిస్టేబుళ్లు, నలుగురు ఐసీడీఎస్ సిబ్బంది, కార్మిక శాఖాధికారులు ఉంటారు. వీరు తప్పిపోయి తిరుగుతున్న చిన్నారులను గుర్తిస్తారు. సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపర్చి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తారు.

ప్రత్యామ్నాయ పాఠశాలలు కరువు..

బాల్కొండ మండలం బస్సాపూర్, జలాల్‌పూర్ శివారులో అనేక ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. ఆ ఇటుక బట్టీల వద్ద కార్మికుల పిల్లల కోసం ప్రత్యమ్నాయ పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిన ఉండగా విద్యాశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు ఆవైపు ప్రయత్నించిన దాఖలాల్లేవు. ఇటుక బట్టీల యజమానులు సౌకర్యాలు కల్పిస్తే విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యావలంటీర్లను నియమించి విద్యాబుద్ధులు నేర్పుతారు. కాని అలాంటి కార్యక్రమాలు ఇప్పటివరకు జరగలేదు.

ఆర్నెళ్లకు మళ్లీ యథాస్థితికి..

ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిరంతరం చేపడితే ప్రయోజనం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జనవరి, జూలై నెలల్లో మాత్రమే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గుర్తించిన బాలకార్మికులకు విముక్తి కల్పించి అధికారులు వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చినప్పటికీ కుటుంబ అవసరాలకు మళ్లీ వారిని పనుల్లో పెడుతున్నారు. దీంతో బడుల్లో ఉండాల్సిన బాల్యం పనుల్లో మగ్గిపోతోంది. ప్రభుత్వ లక్ష్యం మంచిదే అయినప్పటికీ ఈ ప్రక్రియ నిరంతరం సాగాలని పలువురు కోరుతున్నారు.

చిన్నారులను పనుల్లో పెట్టుకోవద్దు

చిన్నారులను పనిలో పెట్టుకోవద్దు. చిన్నారులతో పని చేయిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా మైనర్లను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం అందిస్తే తనిఖీలు చేపడతాం. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా తప్పిపోయిన, బందీ అయిన చిన్నారులకు విముక్తి కల్పిస్తాం. – వెంకటయ్య, సీఐ, ఆపరేషన్ ముస్కాన్ ఇన్‌చార్జి, నిజామాబాద్

చర్యలు తీసుకుంటాం

బడీడు పిల్లలను బడిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటాం. ప్రత్యామ్నాయ పాఠశాలల కోసం ప్రభుత్వం నుంచి ఇప్పటిదాకా అనుమతి రాలే దు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – రాజేశ్వర్, ఎంఈవో, బాల్కొండ

జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ వివరాలు

ఏడాది	గుర్తించిన బాలకార్మికులు	తల్లిదండ్రుల వద్దకు చేరిన వాళ్లు	రిహాబిలిటేషన్‌కు వెళ్లిన చిన్నారులు
2020	139	88	51
2021	155	153	2
2022	38	38	--

బాలకార్మికుల సమాచారం ఇవ్వాల్సిన ఫోన్ నంబర్లు

డయల్	100
స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్	87126 59777
నిజామాబాద్ ముస్కాన్ ఇన్‌చార్జి ఎస్సై	87125 78197
ఆర్మూర్ ముస్కాన్ ఇన్‌చార్జి ఎస్సై	94930 21372
బోధన్ ముస్కాన్ ఇన్‌చార్జి ఎస్సై	81064 70149

సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

ఆక్సిజన్ అందక ఆగిన ఊపిరి



జీజీహెచ్‌లో వైద్యులతో మాట్లాడుతున్న మృతుడి కుమారుడు శివకుమార్, భార్య సునీత

- వైద్యుల నిర్లక్ష్యంతో ముగ్గురి మృత్యువాత
- నిజామాబాద్ జీజీహెచ్‌లో ఘటన

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం చోటు చేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యంతో ఆదివారం తెల్లవారుజామున 3 నుంచి 8 గంటల వరకు ఐసీయూలో చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులు మృత్యువాతపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బోధన్ మండలం పెద్దమావందికి చెందిన మాధవరావు(70) కాళ్లు, చేతుల వాపుతో శనివారం జీజీహెచ్‌కు వచ్చారు. ఆయన రక్తహీనతతో బాధపడుతున్నారని గుర్తించిన వైద్యులు ఐసీయూలో ఉంచి వైద్యం అందించారు. ఆదివారం ఉదయం 7 గంటలకు మాధవరావు కుమారుడు శివకుమార్ అతనికి పండ్లు తినిపించి, నీరు తాగించి వెళ్లిపోయాడు. మాధవరావు కొంతసేపటికి ఊపిరి పీల్చుకోవడంతో ఇబ్బంది పడడంతో అతడి కుటుంబ సభ్యులు ఐసీయూలోని డ్యూటీ డాక్టర్లు, నర్సులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదు. ఉదయం 8 గంటలకు మళ్లీ వైద్యులు, నర్సులకు చెప్పినా స్పందించలేదు. దీంతో పక్క వార్డులో ఉన్న వైద్యుడిని సంప్రదించగా పేషెంట్‌ను పరిశీలించి డ్యూటీ డాక్టర్లు చూసుకుంటారని చెప్పి వెళ్లిపోయారు. ఉదయం 10 గంటలకు వచ్చిన డ్యూటీ డాక్టర్ పరిశీలించి, అప్పటికే మాధవరావు మృతి చెందారని చెప్పారు. రెండు గంటల నుంచి తన తండ్రి ఇబ్బంది పడుతున్నాడని చెప్పినా డాక్టర్లు, సిబ్బంది స్పందించలేదని మృతుడి కుమారుడు శివకుమార్ ఆరోపించారు. ఆదివారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో మరో ఇద్దరు పేషెంట్లు కూడా ఆక్సిజన్ అందక ఇబ్బంది పడ్డారన్నారు. వారికి సైతం వైద్యులు సహకరించలేదని, ఆ ఇద్దరూ మరణించారని పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తన తండ్రి చనిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగగా.. పోలీసులు సర్దిచెప్పి పంపించారు.

ఉమ్మడి కుటుంబాలు వేరుపడ్డాయి..

- జిల్లాలో పెరిగిన కుటుంబాల సంఖ్య
- ప్రజాపాలన దరఖాస్తులల్లో వెల్లడైన వివరాలు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల కోసం జిల్లాలో కొత్త కుటుంబాలు పుట్టుకొచ్చాయ్.. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, కొత్త రేషన్‌కార్డుల తదితరాల కోసం ఉమ్మడి కుటుంబాలు వేరుపడ్డాయి. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 4.20 లక్షల కుటుంబాలు ఉన్నాయి. అయితే ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన మొత్తం 4,77,808 దరఖాస్తులు వచ్చాయి. అంటే 57,808 కొత్తగా కుటుంబాలు పెరిగాయని స్పష్టమవుతోంది. గత పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల జారీ నిలిచిపోవడం, జనాభా లెక్కలు తీయక పోవడంతో ఇలా కొత్త కుటుంబాలు దరఖాస్తుల రూపంలో బయటపడ్డాయి.

తెలంగాణ ఏర్పడి టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ ఆనాడు సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) పేరుతో ఒక్కరోజులో సర్వే నిర్వహించి మొత్తం ప్రజల డేటా సేకరించారు. ఇప్పుడు అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన అభయహస్తం పేరుతో ప్రజల నుంచి గతనెల 28 నుంచి ఈ నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరించింది. ఈ ప్రక్రియలో అధికారికంగా ఉన్న కుటుంబాలకు అదనంగా 57,808 ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. ఈ పదేళ్లలో తల్లిదండ్రుల నుంచి వేరుపడటం, కొత్తగా పెళ్లయినవారు, వారికి పుట్టిన పిల్లలకు రేషన్ కార్డు లేక అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. రేషన్‌కార్డులు ఎప్పటికప్పుడు జారీ చేస్తే వాస్తవానికి ప్రస్తుతం ఉన్న కుటుంబాల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చేది. కొత్త ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీకి అవకాశం కల్పిస్తామని చెప్పడంతో ఆధార్‌కార్డుతో సొంతంగా కొత్త పథకాల కోసం దరఖాస్తు చేసుకోవడమే కాకుండా రేషన్ కార్డులకు కూడా దరఖాస్తు చేసుకున్నారు.

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి

● ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్ : దేశంలోని అర్హులైన ప్రతిఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమమని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎల్లమ్మగుట్టలో ఎల్లమ్మ ఆలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరించి, కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అంతకుముందు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలియని వారికి పథకాలు అందజేసేందుకు ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం సుమారు 45 వేలమంది దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ అర్హతను బట్టి పథకాలను వర్తింపజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ న్యాలం రాజు, ధర్మానాయక్, నాయకులు, కార్పొరేటర్లు ఆకుల హేమలత శ్రీనివాస్, బంటు వైష్ణవి రాము, ఎర్రం సుధీర్, మెట్టు విజయ్, ఇప్పకాయల కిషోర్, రవి, వేణు, ఖైజర్, రోషన్, శీల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ తదితరులు

పంచాయతీ పోరుకు బ్రేక్..!

- పార్లమెంట్ ఎన్నికల తర్వాతే..
- ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనున్న పాలకవర్గాల గడువు
- రిజర్వేషన్ల మార్పుపై ప్రభుత్వానిదే తుది నిర్ణయం



సుభాష్‌నగర్ : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పంచాయతీ ఎన్నికలకు బ్రేక్ పడినట్లేనా అంటే.. అటు అధికారులు, ఇటు ప్రభుత్వం నుంచి అవుననే సమాధానమే వస్తోంది. బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరుతుండటం, పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండటం, నూతన ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కూడా కాకపోవడంతో పంచాయతీ ఎన్నికలు వాయిదా వేసేందుకు సర్కారు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి–1తో ప్రస్తుత పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియనుంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాతే గ్రామ పోరును చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై ప్రభుత్వానిదే తుది నిర్ణయమని అధికారులంటున్నారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీలు, 4,932 వార్డు స్థానాలున్నాయి. అందులో ఇందల్వాయి మండలంలోని గంగారాం తండా, తిర్మన్‌పల్లి జీపీలకు పలు కారణాలతో ఎన్నికలు జరగలేదు. మరో 13 సర్పంచి స్థానాలు, 175 వార్డు స్థానాలకు ఆకస్మికంగా ఖాళీలు ఏర్పడ్డాయి. సర్పంచులకు నెలకు రూ. 5వేల గౌరవవేతనం ప్రభుత్వం చెల్లిస్తోంది. సర్పంచ్, ఉప సర్పంచులకు కలిపి చెక్‌పవర్ ఇచ్చింది.

రిజర్వేషన్లపై గ్రామస్థాయిలో..

జీపీలకు రిజర్వేషన్ల మార్పుపై ప్రభుత్వానిదే తుది నిర్ణయం. ప్రస్తుతమున్న పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పాత రిజర్వేషన్లు కొనసాగనున్నాయి. పదేళ్లపాటు అవే రిజర్వేషన్లు ఉంటాయని చట్టంలో గత ప్రభుత్వం పొందుపర్చింది. ఆ సమయంలో రిజర్వేషన్లు కొందరికి ఖేదం. మరికొందరికి మోదంగా మారాయి. రిజర్వేషన్ల మార్పుపై గ్రామస్థాయి నుంచి ఒత్తిడి వస్తే తప్ప మార్చే పరిస్థితి లేదు.

సంకట స్థితిలో సర్పంచులు..

పంచాయతీ పాలకవర్గాలకు గడువు సమీపిస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు ఎమ్మెల్యేలు, మంత్రులను కలుస్తున్నారు. ఐదేళ్లలో తాము అప్పుల పాలై ఆస్తులు అమ్ముకున్నామని, బిల్లులు రాకపోవడంతో కొందరు కూలీలుగా మారారని, ఇంకొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రుల ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. రాష్ట్రంలో అధికమంది సర్పంచులు బీఆర్‌ఎస్‌లో ఉండిపోయారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో సర్పంచులు సంకట స్థితిలో ఉన్నారు. ఈ తరుణంలో పర్సన్ ఇన్‌ఛార్జికి అవకాశమిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో పలుమార్లు పర్సన్ ఇన్‌ఛార్జికి అవకాశమివ్వగా, కొన్నిసార్లు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. ప్రస్తుతమున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో అనేది వేచిచూడాలి. కాగా ఈవిషయమై మరికొన్ని రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తెలిపారు.

ఆర్నెళ్లలోపే అవకాశం..!

జీపీ పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలి. లేకపోతే ప్రస్తుతమున్న చట్టం ప్రకారం పంచాయతీలకు గ్రాంట్లు నిలిచిపోయే అవకాశముంది. పార్లమెంట్ ఎన్నికలు మే చివరి వారం వరకు ముగుస్తాయి. గతంలో పంచాయతీ ఎన్నికల తర్వాత పార్లమెంట్, స్థానిక సంస్థలు, (ఎంపీటీసీ, జెడ్పీటీసీ), మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించారు. కానీ ఈ దఫా సార్వత్రిక ఎన్నికలు ముగిసిన వెంటనే పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి
- ప్రారంభమైన జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ
- తొలిరోజు నాలుగు మ్యాచ్‌ల నిర్వహణ



పోటీలను ప్రారంభిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్స్‌లో తలపడుతున్న తెలంగాణ- వెస్ట్ బెంగాల్ జట్లు

కామారెడ్డి టౌన్: మన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి పోటీలలోనూ సత్తాచాటాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–17 జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ ఆదివారం రాత్రి ప్రారంభమైంది. కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి టోర్నీని ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 28 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. క్రీడాకారులు ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు గౌరవవందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కామారెడ్డిలో మొట్టమొదటిసారిగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నందుకు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులను అభినందించారు.

క్రీడల నిర్వహణకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంభం రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి నాయబ్ రసూల్, దాతలు పైడి ఎల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, పీఈటీలు పాల్గొన్నారు.

బోణీకొట్టిన తెలంగాణ జట్టు

టోర్నీలో తొలిరోజు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించారు. కేరళ –జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ – జమ్మూ కశ్మీర్, తెలంగాణ –వెస్ట్ బెంగాల్, ఎన్‌వీఎస్ –తమిళనాడు జట్ల మధ్య పోటీలు జరిగాయి. వెస్ట్ బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 పాయింట్‌ల ఆధిక్యంతో తెలంగాణ జట్టు విజయం సాధించింది. ఈ పోటీలో తెలంగాణ 37, వెస్ట్ బెంగాల్ 29 పాయింట్లు సాధించాయి. జార్ఖండ్ జట్టు కేరళపై 30 –26 తేడాతో, హిమాచల్‌ప్రదేశ్ జట్టు జమ్మూకశ్మీర్‌పై 71 – 35 పాయింట్లతో, తమిళనాడు జట్టు ఎన్‌వీఎస్‌పై 42 –24 పాయింట్లతో గెలుపొందాయి.

క్లుప్తంగా

మోసం చేసిన భర్తపై చర్యలు తీసుకోవాలి



పెర్కిట్: తనకు తెలియకుండా మరో వివాహం చేసుకన్న భర్తపై చర్యలు తీసుకోవాలని ఓ బాధితురాలు ఆందోళన చేపట్టింది. ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్‌కు గంగాధర్‌తో బాల్కొండకు చెందిన కావ్యతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఇద్దరి మధ్య గొడవల కారణంగా కావ్య బాల్కొండలో తల్లివద్ద ఉంటోంది. గొడవకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. 15 రోజుల క్రితం గంగాధర్ మరో వివాహం చేసుకున్నాడు. దీంతో కావ్య ఫత్తేపూర్‌లో తన ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. తనను మోసం చేసిన భర్త గంగాధర్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరారు.

దరఖాస్తు గడువు పెంపు

బాన్సువాడ రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి ఆహ్వానిస్తున్న దరఖాస్తుల గడువును ఈ నెల 20వరకు పొడిగించినట్లు గురుకుల ప్రిన్సిపాల్ పద్మకుమారి ఆదివారం పేర్కొన్నారు. 2023–24లో 4వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష ఉంటుందని అన్నారు. మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్యాంపస్‌లో కొనసాగుతున్న క్రీడా పోటీలు



తెయూ: తెయూ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు శనివారం నాలుగోరోజు కొనసాగాయి. కార్యక్రమానికి ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, ఇందూరు విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్‌లను యువత ఆదర్శంగా తీసుకొని దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగరాజు, సాయికుమార్, అమృత్ చారి, హరికృష్ణ, నరేశ్, ప్రమోద్, సింహాద్రి, నరసింహ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంఘం జిల్లా ఇన్‌చార్జిగా హరికృష్ణ



నిజామాబాద్‌నాగారం: ప్రొగ్రెసివ్ జర్నలిస్టుల సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా హరికృష్ణ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ప్రొగ్రెసివ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇందులో సంఘం ప్రతినిధులు వీరాంజనేయులు, చెన్నకేశవరావులు హరికృష్ణను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. అనంతరం ఆయనను సత్కరించారు.

నో స్కానింగ్..

- ఆస్పత్రుల్లో అందుబాటులో స్కానింగ్ యంత్రాలు
- రేడియాలజిస్టులు లేక తిప్పలు
- ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు గర్భిణుల పరుగులు

మోర్తాడ్(బాల్కొండ): గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి సామాజిక ఆస్పత్రులకు స్కానింగ్ యంత్రాలను గత ప్రభుత్వం సమకూర్చినప్పటికీ రేడియాలజిస్టులు నియమించకపోవడంతో స్కానింగ్ సేవలు ఇంకా మొదలు కాలేదు. ఫలితంగా గర్భిణులు స్కానింగ్ కోసం ప్రైవేటు సెంటర్లకు పరుగులు పెట్టాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ, శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవ సేవలను అందించడంలో భాగంగా గర్భిణీలకు అవసరమైన స్కానింగ్ చేయడానికి ప్రభుత్వం గతంలో స్కానింగ్ యంత్రాలను కేటాయించింది. ఈ యంత్రాల ద్వారా గర్భిణీలు, పుట్టబోయే పసిపాపల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాల్సి ఉంది. మోర్తాడ్, బాల్కొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, కోటగిరి, వర్ని, నవీపేట్‌లలోని కమ్యునిటీ ఆస్పత్రులు, బోధన్‌లోని ఏరియా ఆసుపత్రి, ఆర్మూర్‌లోని వంద పడకల ఆసుపత్రి, జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రులకు స్కానింగ్ యంత్రాలను మంజూరి చేశారు. గైనకాలజిస్టులు, మత్తు వైద్యుల పోస్టులతో పాటు రేడియాలజిస్టుల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. కానీ రేడియాలజిస్టుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో వారి సేవలు వివిధ ఆస్పత్రులలో అందడం లేదు. కేవలం స్కానింగ్ సేవలు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రులలోనే అందుతున్నాయి. మహిళలు గర్భం ధరించిన నుంచి ప్రసవించే వరకు మూడు మార్లు స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంది. ఒక్కో స్కానింగ్‌కు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ఆర్థికంగా స్థితిమంతులైన వారికి ప్రైవేటు సెంటర్‌లకు వెళ్లడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. పేదలు, మధ్య తరగతి కుటుంబాల వారు ప్రభుత్వ ఆస్పత్రులలోనే ప్రసవించడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే..

గత ప్రభుత్వం గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రులలోనే ప్రసవించాలని అనేక కార్యక్రమాలను అమలు చేశారు. గర్భిణీలుగా ఉన్నప్పుడు పౌష్టిక ఆహారం కోసం ఆర్థిక సాయం అందించడం, ప్రసవించిన తరువాత కేసీఆర్ కిట్ ఇవ్వడం చేశారు. అలాగే లక్షలు ఖర్చు చేసి స్కానింగ్ యంత్రాలను కొనుగోలు చేసిన గత ప్రభుత్వం రేడియాలజిస్టు పోస్టులను భర్తీ చేయకపోవడం పట్ల పలువురు పెదవి విరుస్తున్నారు. గర్భిణీలకు స్కానింగ్ తప్పనిసరి కావడం ప్రభుత్వ ఆస్పత్రులలో స్కానింగ్ సేవలు అందుబాటులో లేక పోవడంతో పేదలు, మధ్య తరగతి కుటుంబాల వారు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్ది, ఆస్పత్రులలో అవసరమైన రేడియాలజిస్టు పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. కమ్యునిటీ ఆస్పత్రులలో స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకరావాలని పలువురు సూచిస్తున్నారు.



మోర్తాడ్ ఆస్పత్రిలోని స్కానింగ్ యంత్రం

వంతెన పనులకు మోక్షం ఎన్నడో..?

- లో లెవెల్ వంతెనలతో గ్రామస్తులకు ఇబ్బందులు
- హై లెవెల్ వంతెనకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు..!
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



వెంగళ్‌పాడ్‌లో..



లింగాపూర్‌లో లో లెవెల్ వంతెన

ఇందల్వాయి: దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించడం లేదన్న చందంగా మారింది ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ మండలాల ప్రజల దుస్థితి. లో లెవెల్ వంతెనలతో గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని హై లెవెల్ వంతెనలు నిర్మించాలంటూ ఈ మూడు మండలాల ప్రజలు గత ప్రభుత్వానికి విన్నవించారు. గతేడాది స్పందించిన ప్రభుత్వం హై లెవెల్ వంతెనల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు మంజూరైనా..

ఇందల్వాయి మండలం లింగాపూర్ వంతెనకు రూ. ఏడు కోట్లు, వెంగళ్‌పాడ్ వంతెనకు రూ. ఐదు కోట్లు, ధర్పల్లి మండలం వాడి వంతెనకు రూ. ఏడు కోట్లు, సిరికొండ మండలం గడ్కోల్ వంతెనకు రూ. 12 కోట్ల నిధులను గత ప్రభుత్వం విడుదల చేసింది. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సైతం శిలాఫలకాలను ప్రారంభించారు. కానీ అధికారులు మాత్రం గతేడాది కురిసిన వర్షాలు తగ్గగానే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పి ఇంత వరకు ప్రారంభించలేదు. వర్షాలు తగ్గి వాగుల్లో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గినా పనులు ప్రారంభం కాకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పనులు ఆలస్యంగా చేపడితే మళ్లీ వర్షాలు పడి వంతెనల నిర్మాణ పనులకు ఆటంకం కలిగే అవకాశాలు ఉన్నాయి. లోలెవెల్ వంతెనల మూలంగా అధిక వర్షాలు పడి వాగులు పొంగినప్పుడు ప్రయాణికులు రోడ్డు దాటలేక, గమ్యాలు చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వంతెనల నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

పనులను ప్రారంభించాలి



గడ్కోల్ గ్రామస్తులు జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే ప్రమాదకరంగా ఉన్న నాలుగు లో లెవెల్ వంతెనలు దాటాలి. వర్షాకాలం అయితే వంతెనలపై వరద ప్రవహిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు ప్రారంభమయ్యేలా చూడాలి.

– చిలుకూరి బాల్‌రెడ్డి, గడ్కోల్

చాలా చోట్ల లోలెవెల్ వంతెనలు



ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంతో పాటు నియోజకవర్గంలోని చాలా చోట్ల లో లెవెల్ వంతెనలు ఉన్నాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే హై లెవెల్ వంతెనలు నిర్మించాలి. అధికారులు స్పందించి పనులను ప్రారంభిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– నోముల శ్రీనివాస్‌రెడ్డి, నల్లవెల్లి



జనవరిలోనే అరకిలో మామిడికాయలు



రామారెడ్డి (ఎల్లారెడ్డి): సామాన్యంగా ప్రతి ఏడాది వేసవి ప్రారంభం నుంచి ఉగాది పండుగ వరకు మామిడి కాయలు వస్తాయి. కానీ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని రాజమ్మతండాలోని గోపాల్‌నాయక్ అనే రైతుకు చెందిన మామిడి చెట్టుకు ఆగస్టు నెల నుంచి పూత పూసి సెప్టెంబర్‌లో కాయలు కాశాయి. ప్రస్తుతం జనవరి నెలలోనే ఒక్కో మామిడికాయ అరకిలో వరకు ఉంది. ప్రతి ఏటా రెండుసార్లు మామిడి కాయలు కాస్తున్నాయని రైతు గోపాల్ నాయక్ తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



కట్లె రాజు (ఫైల్)

రాజంపేట: మండలంలోని సిద్ధాపూర్‌లో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. గ్రామస్తులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్లె రాజు(35) అదే గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి వద్ద వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఉదయం పని నిమిత్తం వేరే చోటుకి పంపించగా పనులు పూర్తి చేసుకొని వచ్చాడు. సాయంత్రం గ్రామానికి చెందిన కొంత మందితో మద్యం సేవించిన రాజును గ్రామ ప్రజాప్రతినిధే హత్య చేయించి చెరువులో పడేశారని ఆరోపించారు. దీంతో నిందితుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇన్‌చార్జి ఎస్సై నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని తెలుపడంతో గ్రామస్తులు శాంతించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మరోమారు గ్రామస్తులు పీఎస్ ఎదుట రాత్రి 8 గంటల సమయంలో ఆందోళన చేపట్టారు. దీంతో గ్రామస్తులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న భిక్కనూరు సీఐ తిరుపతయ్య గ్రామస్తులతో మాట్లాడారు. పూర్తి వివరాలతో తమకు పిటిషన్ ఇస్తే నిందితులను శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

రేకుపై నుంచి పడి ఒకరు..



సాయిలు (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన గొల్లపెద్ద సాయిలు యాదవ్(38) తూప్రాన్ శివారులోని ఓ పరిశ్రమ పైభాగంలో సోలార్ పలకలు బిగించి రేకుపై నుంచి దాటుతుండగా జారిపడి ఆదివారం మృతి చెందాడు. సాయిలు హైదరాబాద్‌లోని సోలార్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పరిశ్రమ పైభాగంలో సోలార్ పనులు ముగించుకుని వెలుతురు కోసం బిగించిన ప్లాస్టిక్ రేకుపై నుంచి దాటుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్..



కానిస్టేబుల్ ముఖేష్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: కామారెడ్డి సీసీఎస్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ముఖేశ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని మృతి జిల్లా పోలీస్ యాంత్రాంగాన్ని కలిచివేసిందని ఎస్పీ సింధు శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కానిస్టేబుల్ కుటుంబానికి జిల్లా పోలీస్ వ్యవస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..



పోచయ్య (ఫైల్)

లింగంపేట: మండల కేంద్రానికి చెందిన టేకు పోచయ్య(19) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. పోచయ్య గత నెల డిసెంబర్ 31న లింగంపేట నుంచి లింగంపల్లి(ఖుర్దు) గ్రామానికి కూలీ పని నిమిత్తం నడుచుకుంటూ వెళ్తున్నాడు. మార్గ మధ్యలో సురాయిపల్లి తండాకు చెందిన రమావత్ హరి ద్విచక్ర వాహనంతో పోచయ్యను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ పోచయ్యను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పతంగుల మాంజాతో గాయాలు



భిక్కనూరు: మండల కేంద్రంలో పతంగుల మాంజాతో ఇద్దరు యువకులకు ఆదివారం గాయాలయ్యాయి. మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన యువకులు అరవింద్, సాయిలు ద్విచక్రవాహనంపై మెదక్ జిల్లా రామాయంపేటకు వెళ్తుండగా సిద్ధరామేశ్వరనగర్ కమాన్ సమీపంలో అకస్మాత్తుగా వారికి మాంజా దారం తగలడంతో చెవులు, మెడ, చేతులకు గాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రిలో వారు వైద్యం చేయించుకున్నారు.

హాస్టల్ విద్యార్థినికి..

దోమకొండ: మండలంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో చదువుతున్న శ్యామల అనే విద్యార్థిని శనివారం రాత్రి మంచంపై నుంచి జారి పడి పడడంతో గాయాలయ్యాయి.వెంటనే హాస్టల్ వాచ్‌మెన్ సామయ్య బాలికను మండల కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు లేకపోవడంతో కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ మంజులను వివరణ కోరగా విద్యార్థిని శ్యామల మంచంపై నుంచి జారి పడింది వాస్తవమేనన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని నీలకంఠనగర్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై మహేశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వీరి నుంచి రూ. 7520 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

భర్తను హత్య చేయించింది భార్యే..

- మల్లారం హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: మల్లారం అటవీ ప్రాంతంలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్యలో అసలు సూత్రధారి భార్యే అని ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5న అటవీ ప్రాంతంలో జరిగిన హత్య కేసులో విచారణ చేపట్టిన పోలీసులు మృతుడి చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా ఇంద్రపురం కాలనీకి చెందిన గురుధాకర్ సయాజీ(35)గా గుర్తించినట్లు తెలిపారు. విచారణలో సయాజీ భార్య అశ్విని సొంత బావ అయిన రామ్ జింజోర్‌తో అక్రమ సంబంధం ఉంది. సయాజీ మద్యానికి బానిస కావడంతో భార్యను తరచూ వేధించేవాడు. ఈ నెల 3న సయాజీ భార్యను కొట్టి ఇంటి నుంచి పంపించాడు. దీంతో భర్తను చంపాలని నిర్ణయించుకున్న భార్య.. బావ రామ్ జింజోర్‌కు ఫోన్ చేసి చెప్పింది. ఈ నెల 5న నిందితుడు సయాజీని మల్లారం అటవీ ప్రాంతంలో హత్య చేశాడు. సాంకేతిక సహాయంతో నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడి బైక్, రెండు సెల్‌ఫోన్లు, చాకును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీఐ వెంకటనారాయణ, ఎస్సై మహేశ్ ఉన్నారు.

అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడి అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీలు రాజశేఖర్‌రాజు, కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: ఐదేళ్లుగా తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాలలో పెద్ద ఎత్తున మట్కా నిర్వహిస్తున్న మహమ్మద్ జమీర్‌ను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు, ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని నాగారంకు చెందిన మహమ్మద్ జమీర్ బుకీల ద్వారా అనేకమంది అమాయక ప్రజలను మట్కా వ్యాపారంలోకి దింపినట్లు చెప్పారు. వారికి డబ్బు ఆశ చూపి రూ.కోట్లలలో మోసం చేసినట్టుగా పోలీసుల విచారణలో తేలిందన్నారు. నిందితుడు మహారాష్ట్రలోని నాందేడ్, ధర్మాబాద్, బిలోలి, వర్ధా, అకోలా, అమరావతితో పాటు అనేక ప్రాంతాలలో మట్కా నిర్వాహకులతో ఉన్న సంబంధాల ద్వారా మట్కాలో ప్రతిరోజు విజేతలుగా రాబోయే నంబర్లను తీసుకొని వాటిపై తన ఏజెంట్స్, బుకీల ద్వారా భారీ ఎత్తున బెట్టింగ్ చేసి రూ.కోట్ల లావాదేవీలు జరిపినట్టుగా విచారణలో తేలిందన్నారు. జమీర్ ముఖ్య అనుచరులను పట్టుకోవడానికి గాలిస్తున్నట్లు చెప్పారు. జమీర్ సంపాదించిన ఆస్తులపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. అనంతరం టాస్క్ ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు, ఏసీపీ కిరణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ సీఐలు అజయ్ బాబు, అంజయ్య, నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఐదవ టౌన్ ఎస్సై అప్పారావు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది రాములు, అనిల్, సుధాకర్, లక్ష్మన్న, రామచందర్, అజమ్ లను సీపీ కల్మేశ్వర్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

గ్రామాల్లో వాహనాల తనిఖీ




లింగంపేటలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై



పెద్దకొడప్‌గల్‌లో..

లింగంపేట/మోపాల్/ పెద్దకొడప్‌గల్/ నస్రుల్లాబాద్: లింగంపేట మండల కేంద్రంలోని పీఎస్ ఎదుట ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. నంబర్ ప్లేట్ లేని 20 వాహనాలకు, లైసెన్సులు, ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎస్సై వెంట కానిస్టేబుల్ రమేశ్, రాజేశ్, హోంగార్డు యాదగిరి, స్వామిగౌడ్, షబ్బీర్ తదితరులు ఉన్నారు. మోపాల్ మండల కేంద్రంలో ఐదు డ్రంక్ అండ్ డ్రైవ్, ఏడు బహిరంగంగా మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ తెలిపారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పెద్దకొడప్‌గల్‌లోని అంజని గ్రామ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై కోనారెడ్డి పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు చెప్పారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నంబర్ ప్లేట్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. వాహన ధ్రువపత్రాలు లేని, హెల్మెట్‌లేని వాహనదారులను పీఎస్‌కు తరలించి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

అనుమతి గోరంత.. తవ్వింది కొండంత



కొండను తవ్వి దారులు వేసుకున్న మొరం వ్యాపారులు

- మొరం క్వారీ నిర్వాహకులపై చర్యలేవీ?
- అక్రమ వ్యాపారులకు అండగా నిలుస్తున్న అధికారులు..



మొరం లోడ్ చేస్తున్న జేసీబీ

మాక్లూర్: మొరం క్వారీ సీజ్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. మండలంలోని సింగంపల్లి శివారు సర్వేనంబర్ 51బై 2లో ఇప్పటి వరకు కొనసాగిన మొరం క్వారీలో నిర్వాహకులు నిబంధనలను అతిక్రమించి తవ్వకాలు చేపట్టారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా పదుల సంఖ్యలో టిప్పర్లతో మొరం తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వ ఒత్తిడి వల్ల అధికారులు ఇటీవల చేసిన తనిఖీల్లో అక్రమ క్వారీల బాగోతం ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. చిన్నాపూర్ సర్పంచ్ పుప్పాల లక్ష్మి భర్త పుప్పాల గంగారెడ్డి పేరున సింగంపల్లి శివారులోని సర్వేనంబర్ 51బై 2లో 2.60 హెక్టార్ల భూమిలో మొరం తీయటానికి అనుమతి ఉండగా పరిధిని దాటి మరో 20 ఎకరాల వరకు తవ్వేశారు. ఇందులో బండరాళ్లను పగులగొట్టే పేలుడు పదార్థాలు పెద్ద ఎత్తున లభించటంతో అధికారులు అవక్కాయ్యారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బావమరిది నరేందర్‌రెడ్డి నిబంధనలను అతిక్రమించి విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకున్నారు. క్వారీ పుప్పాల గంగారెడ్డి పేరున ఉన్నందున అతనిపై కేసు నమోదైంది. అప్పటి వరకు బినామిగా ఉండి అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసిన నరేందర్ రెడ్డి మాత్రం తన పేరు బయటకు చెప్పొద్దంటూ హెచ్చరించి పారిపోయాడు. క్వారీ నిర్వాహకులపై చర్యలు చేపట్టలేదని స్థానికంగా ఉండే జి రాజేశ్వర్‌గౌడ్ ఈ నెల 4న మైన్స్ ఏడీ సత్యనారాయణకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. అధికారులు ఇలా చూసీచూడనట్టు వ్యవహరిస్తూ తగిన చర్యలు చేపట్టకపోవటం వల్లే గుట్టలు ఖాళీ అవుతున్నాయి. ఉన్నత అధికారులు స్పందించి క్వారీ నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కుంటలో మృతదేహం లభ్యం

బోధన్‌టౌన్: పట్టణంలోని కరుణం కుంటలో ఓ మహిళ మృతదేహం లభ్యమైనట్లు సీఐ వీరయ్య ఆదివారం తెలిపారు. కుంటలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన లక్ష్మి (50) పక్షవాతంతో బాధపడుతోంది. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.